# పెన్ పవర్

ప్రజా గళానికి అక్షర రూపం

తెలుగు దిన పత్రిక


## జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో ఘనంగా పర్యావరణ దినోత్సవం



**కాకినాడ, పెన్‌పవర్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపి కాలుష్య నివారణ మండలి, ధరిత్రీ రక్షిత సమితి మరియు జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయం వారు సంయుక్తంగా ది.05.06.2018 మంగళవారం ఉదయం 10గంటలకు అలూమ్ని ఆడిటోరియం నందు పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సభకు ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.ఎస్.రామకృష్ణారావు గారు విచ్చేయగా గౌరవ అతిథులుగా రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నరసారావుపేట ప్రిన్సిపాల్ ప్రొ.కెవిఎస్‌జి.మురళీకృష్ణ, ధరిత్రీ రక్షిత సమితి అధ్యక్షురాలు శ్రీమతి సురేఖలు వేదికనలంకరించారు.

ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.ఎన్.రామకృష్ణారావు మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచడంపై శ్రద్ధ వహించి నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలన్నారు. జెఎన్‌టియుకెలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించే దిశగా తాము తగిన చర్యలు చేపట్టనున్నామన్నారు. అతిథులకు పూలతో కాకుండా మొక్కలను ఇచ్చి స్వాగతించాలని, మొక్కలను పెంచడం ద్వారా ప్లాస్టిక్ మహమ్మారి నుండి భూమండలాన్ని సంరక్షించుకోవాలన్నారు. ప్రకృతిని ప్రేమించి మమేకమవ్వాలని, పిల్లల్లో బాధ్యతారాహిత్యం, చైతన్యం తీసుకువచ్చి వారిని ప్రకృతి ప్రేమికులుగా మార్చగలిగితే వారే ప్రకృతిని సంరక్షించి భావి తరాలకు అందజేయగలరన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.ఎస్.రామకృష్ణారావు గారు ఈఈఈ విభాగం ఎదురుగా గల డివైడర్ వద్ద మొక్కను నాటారు.

అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అతిథులకు ఏపి కాలుష్య నివారణ మండలి వారు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు, జెఎన్‌టియుకె అధికారులు, అధ్యాపకులు, కాలుష్య నివారణ మండలి అధికారులు, అటవీ శాఖాధికారులు, ధరిత్రీ రక్షిత సమితి సభ్యులు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.